# వర్ణక్రమాలు

'గుడ్ మార్నింగ్ ఎవ్విరిబడి' అన్నాను నేను స్టాఫ్ రూంలో అడుగుపెట్టి. 'ఇక్కడున్న వాళ్ళందరికీ తెలుగొచ్చు. నువ్వు ఇంగ్లీషులో ఏడ్వక్కర్లేదు' అన్నాడు తెలుగు టీచర్ విశ్వనాథం. విశ్వనాథం ఇంగ్లీషులో రెండు వాక్యాలు సరిగా మాట్లాడలేడు. అంచేత ఇంగ్లీషులో మాట్లాడితే వాడికి కోపం - 'అయినా పన్నెండు దాటింది. ఇంకా మార్నింగేవిటి నీ తలకాయ.....'

'డ్రిల్లు మాస్టర్ల బ్రెయిన్ బూటులో ఉంటుంది. రొటీన్‌గా లెఫ్ట్, రైట్ అనడం తప్ప అంత ఆలోచన ఎక్కడుంటుంది?' అన్నాడు సత్యన్నారాయణ ఇంగ్లీషులో. వాడు ఇంగ్లీషు టీచ్ చేస్తాడు. శామ్యూల్ జాన్సన్ అంతటివాడిననుకుంటాడు.

వాళ్ళిద్దరికి నన్ను చూస్తే అసూయ. వాళ్ళే కష్టపడి పోతున్నట్లు, ' నీకేం? పిల్లకాయ లకి బంతో, బేటో పడేసి గ్రవుండులోకి తోలేసి హాయిగా, కాళ్ళు పారజాపుకు కూర్చుం టావు' అని గోల పెడతారు.

ఇంగ్లీషు - తెలుగుల జాయింట్ ఎటాక్ నుంచి తప్పించుకోడానికి, అప్పుడే ఉసురు సురంటూ స్టాఫ్ రూంలోకి వస్తున్న శర్మగారిని 'ఏవిటి శర్మగారూ, ఇవాళ కూర? ' అని పలకరించాను.

'కూరా? నా పిండాకూడా? పూజలోంచి లేచేలోగా మాడి చచ్చింది' అన్నారు ఆయన విసుగ్గా.

శర్మగారి భార్య, వాళ్ళమ్మాయికి ఆరోగ్యం బాగా లేదంటే చూడడానికి వెళ్ళింది. రెండు నెలల నుంచీ అక్కడే ఉంటోంది. అమ్మాయికి డెలివరీ అయితే కాని తిరిగి

రానని ఉత్తరం రాసింది. శర్మగారికి మడి, ఆచారం ఎక్కువ. హోటల్లో భోంచెయ్యరు. ఆయనే వండుకుంటున్నారు.

'అలా చెయ్యి కాల్చుకోకపోతే హాయిగా కొడుకూ, కోడలు దగ్గర ఉండ కూడదూ? కోడలు వండి పెట్టేది కదా! మా వియ్యంకుడి గారికి కోడలి చేతి భోజనం తినే అదృష్టం లేదు' అంది దయామణి వరస కలిపి నవ్వుతూ. ఆ మాటంటే శర్మగారు ఉడుక్కుం టారని తెలుసు. ఆయన్ని ఉడికించడానికే అలా అంది ఆవిడ.

శర్మగారికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. టీచరుగా శర్మగారు సంపాదించి నదేవీలేదు. కొడుక్కి పెళ్ళి చేద్దామని ఆయన ఆలోచిస్తుండగా ఆ కుర్రాడు అతని ఆఫీసులోనే పనిచేస్తున్న అమ్మాయిని ప్రేమించి, కానీకట్నం లేకుండా పెళ్లి చేసు కున్నాడు. పైగా వర్ణాంతర వివాహం. కొడుకు హరిజనుల అమ్మాయిని చేసుకున్నా డంటే కూతురికి అసలు సంబంధాలు రావేమో అని ఆయన బెంగ పెట్టుకున్నారు. చివరకు మంచి సంబంధం వచ్చింది, కానీ వాళ్ళు శర్మగారి పరిస్థితి గమనించి, బిగిసి, కట్నం ఎక్కువ అడిగారు. కొడుకు ఆదుకున్నాడు. ఎక్కువ కట్నం ఇవ్వగానే వాళ్ళ అభ్యంతరాలన్నీ తొలగిపోయాయి కాబోలు. ఆ పెళ్ళి సవ్యంగా జరిగి అమ్మాయి హాయిగా కాపురం చేసు కుంటోంది. శర్మగారు చాలా కాలం కొడుకు ఇంటికి వెళ్ళలేదు. కానీ, ఏవనుకున్నారో ఏమో, కూతురి పెళ్ళయ్యాకా కొడుకు ఇంటికి వెళ్ళి రావడం మొదలు పెట్టారు. అయితే కొడుకు ఇంట్లో ఇప్పుడు కూడా పచ్చి మంచి నీళ్ళు ముట్టరు.

' ...కోడలక్కర్లేదు కాని కోడలి డబ్బు మాత్రం కావాలి మా అన్నయ్యగారికి' అంది దయామణి మళ్ళీ.

'వాడి చెల్లెలి పెళ్ళికి వాడు ఖర్చుపెట్టాడు...'- అంతవరకు మౌనం వహించిన శర్మ గారు ఇంక తప్పనిసరై నోరు విప్పారు.

'అంతా అల్లుడిగారి డబ్బే కాబోలు - మా అమ్మాయి సంపాదన లేదా? పెళ్ళి ఖర్చు భరించడానికి కోడలు కావల్సి వచ్చింది. కాని పెళ్ళి బంతిలో కూర్చోడానికి పనికి రాలేదు' అంది దయామణి ఎత్తిపొడుస్తూ.

పెళ్ళికి కొడుకూ, కోడలు వచ్చి, కొంచెం సేపు ఉండి వెళ్ళి పోయారు. వాళ్ళని ఉండమంటే బ్రాహ్మల బంతిలో కూర్చోబెట్టాలా, విడిగా కూర్చోబెట్టాలా అన్న సమస్య వచ్చింది. బ్రాహ్మల బంతిలో కూర్చోబెడితే పెళ్ళివారూ, పెళ్ళికొచ్చిన బ్రాహ్మలూ లేచి పోతారేమో? పెళ్ళి కూతురి అన్నా వదినెలకు, బంధువులతో పాటు కాకుండా విడిగా ఏ అరుగుమీదో వడ్డిస్తే బాగుంటుందా? ఈ ఆలోచనతో సతమతమవుతూ ఆయన వాళ్ళను భోజనాలకి ఉండమనలేక పోయారు. దయామణికి ఆ విషయం చాలా కష్టంగా తోచింది. అప్పట్నుంచీ అవకాశం చిక్కినప్పుడల్లా శర్మగారిని సూటిపోటి మాటలంటోంది.

శర్మగారు నూటికి తొంబై మంది లాగా మంచైనా, చెడైనా, వాలులో కొట్టుకుపోయే మనిషే కాని, లోకానికి ఎదురీది నిలువగల ధైర్యం, మొండితనం ఉన్న మనిషి కాదు. ఎన్నోసార్లు ఆయన నా దగ్గర, ' ఏవిటోరా చంద్రం! వాళ్ళు.... ఇంటికి

వస్తే భోజనానికి ఉండమనలేకపోయాను' అని కన్నీళ్ళు పెట్టుకున్నారు కూడా.

దయామణికి సూటిగా ఏం సమాధానం చెప్పలేక, 'పెళ్ళి చెయ్యాలన్నా, పీనుగు లేవాలన్నా, మానాభిమానాలు వదిలేసి, 'భిక్షాందేహి' అని నలుగురి కాళ్ళూ పట్టుకోవాల్సిన వాళ్ళం. మాకేమన్నా ఆస్తిపాస్తులున్నాయా? కాలేజీల్లో కోటాలా? ఉద్యోగాల్లో రిజర్వేషన్లా? ఏవుంది నా(శ్రాద్ధం.....' అంటూ తనకు అలవాటైన పద్ధతిలో ఫ్లాంక్ నుంచి ఎటాక్ మొదలుపెట్టారు శర్మగారు.

'ఆస్తి లేకపోతేనేం? వంశపారంపర్యంగా వస్తున్న తెలివి తేటలున్నాయి మీకు! హరి జనుడికేమో ఇంకా ఒక కాలు పొలం లోనే ఉంది. అలాంటి వాణ్ణి మెరిట్ పేరుతో మీతో సమానంగా పరిగెట్టమంటారు. పైగా అది న్యాయం అంటారు. అమ్మో! ఎన్ని తెలివి తేటలు? ఎంతైనా కరణం బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు శర్మగారు' అంది దయామణి వెటకారంగా.

ఆ తర్వాత విశ్వనాథం, సత్యనారాయణ.... అందరూ మాట్లాడటం మొదలుపెట్టారు. ఈ కబుర్లు మామూలుగా రోజూ ఉండేవే అయినా , మాటల విసురు చూస్తే ఇది చినికి చినికి గాలి వాన అయ్యేలా ఉంది అనిపించింది నాకు. నేను కలగచేసు కోకుండా వాళ్ల మాటలు వింటూ కూర్చున్నాను.

'మీరేవీ అనుకోకపోతే ఓ మాట అడగనా?'- రాజుల లక్ష్మి గారు కలుగచేసు కుంటూ అన్నారు - 'మీరు టీచరు, మీ ఆయన క్లాస్‌టు గెజిటెడ్ ఆఫీసరు. మీ విజయని మా పిల్లల కంటే ఎక్కువగా రెసిడెన్షియల్ కాన్వెంటులో చదివించారు. అమ్మాయికి మెడిసిన్లో సీటొచ్చింది. రేపు డాక్టరవుతుంది. సమాజంలో ఉన్నత స్థానం చేరుకున్న మీలాంటి వారికి కూడా రిజర్వేషన్లు ఏవిటి చెప్పండి.....'-సన్న సన్నగా అంటించింది ఆవిడ. లక్ష్మిగారి అబ్బా యికి మంచి మార్కులొచ్చినా ఏ ఇంజినీరింగ్ కాలేజీలోనూ సీటు రాలేదు. అందుగురించి ఆవిడకి చాలా కష్టంగా ఉంది.

లక్ష్మిగారు రంగంలోకి దిగడంతో, ఆడ అభిమన్యుడిలా మాటల బాణాలు అటూ ఇటూ చక చక విసురుతున్నా , ఒంటరిదైపోయింది దయామణి. క్రాఫ్ట్ మాస్టారు వెంకటే శ్వర్రావు గారు ఆవిడకి మాట సపోర్టైనా ఇవ్వకుండా తనకేం పట్టనట్లు గదిలో ఓ మూల కూర్చుంటే, దయామణికి తోడుగా ఆయన్ని రంగంలోకి దించుదామని, 'ఏం మాస్టారు! మీరేం మాట్లాడటం లేదు' అన్నాను ఆయనకేసి తిరిగి.

'ఆయ్....నేనేం మాట్లాడనండీ? దయామణిగారు చెబుతున్నారు కదా...' అన్నారు ఆయన చేతులు నలుపుకుంటూ.

ఆయనది అదో స్వభావం. నలుగురితోనూ కలవరు. బర్త్‌డే పార్టీలనీ, పెళ్ళిళ్ళనీ ఫంక్షన్లనీ, టీచర్లందరం ఎవరి ఇంట్లోనో ఒకరింట్లో కలుస్తూనే ఉంటాం. కాని, ఆయ సాధారణంగా ఎవరింటికీ రారు. ఆయన ఇంటికి మమ్మల్ని ఎప్పుడూ పిలవలేదు. 'ఎక్కడుంటారు మాస్టారూ?' అంటే, 'సంత మార్కెట్టు ఎనకాలండి.... దయామణి గారికి తెలుసండి,' అని మాట తప్పించేస్తారు కాని సరిగా చెప్పరు. మొన్న దయామణి కొత్త ఇల్లు గృహప్రవేశానికి, టీచర్లందరం ఫామిలీలతో వచ్చినా, ఆయన మాత్రం ఒక్కరే వచ్చి కాసేపు మొహమాటంగా కూర్చుని వెళ్ళి పోయారు. ఆయన ఫామిలీ

తాలూకు వాళ్ళెవరూ రాలేదు. దయామణి లాగా ఆయన పెద్ద తెలివి తేటలున్నవారు కారు. ఆర్థికంగా కూడా అంత బాగా ఉన్నట్టు కనిపించరు. అంచేత కొంచెం ఇన్ఫీరియారిటీ ఫీలవుతున్నారేమో అనిపిస్తుంది నాకు.

వెంకటేశ్వర్రావు గారు అలా అనగానే దయామణి ఆయనకేసి ఒకసారి నిరసనగా చూసి, లక్ష్మిగారి కేసి తిరిగి అంది - ' మన బీడీవో గారు ఎంత అద్దె ఇవ్వడానికి సిద్ధమైనా కొత్తపేటలో ఆయనకు ఇల్లు దొరికిందా? మీ ఇళ్ళల్లో మేం తాగిన కాఫీ కప్పులు మీరు ముట్టుకోకుండా పనిమనిషి చేత కడిగించడం నాకు తెలియదనుకుంటున్నారా? సమాజంలో పైకి రావడం ఎక్కడ? ఏ ఉద్యోగం చేసినా, ఏ పదవిలో ఉన్నా హరిజనుడి స్థానం అట్టడుగునే. ఎంత పైకొచ్చినా అంటరాని వాడుగానే చూస్తారు....'

'వాళ్ళూ, వీళ్ళూ మీకు అన్యాయం చేశారని మీరు ఆవేశపడుతున్నారు. కాని మీరు మీ వాళ్ళకు ఏం చేస్తున్నారో కొంచెం ఆలోచించండి..' -రాజుల లక్ష్మిగారు ఊరుకోలేదు. దయామణి ఈ మధ్య మారుతీ కారు కొనుక్కున్నందుకు ఆవిడకి అసూయగా ఉంది. ఆ ప్రస్తావన తీసుకొస్తూ అంది-'..... కార్లలో దూసుకుపోయే మీలాంటి వాళ్ళు పొలంలో ఒక కాలు, స్కూల్లో ఒక కాలు ఉండే దళితులతో సమానమెలా అవుతారు? వాళ్ళపేరు చెప్పి తరతరాలుగా ప్రత్యేక సౌకర్యాలు మీరే అనుభవించడం మీ సోదరులకు ద్రోహం చేసినట్టు కాదా?'

శర్మగారు సపోర్టు దొరకడంతో విజృంభించారు - 'దయామణి కొడుకు, కూతుళ్ళు, మనవలు, మునిమనవలు అందరికీ రిజర్వేషన్లు ఉండాలి. వాళ్ళే బాగుపడాలి, ఎవరు ఎలా పోయినా సరే! రేపు దయామణిని చీఫ్ మినిస్టర్ని చేసినా, ప్రైమ్ మినిస్టరును చేయ లేదు కాబట్టి దళితులకు అన్యాయం జరిగిపోయిందంటుంది...'

'బ్రాహ్మలమని చెప్పుకోవడం కంటే రిజర్వేషన్లే ముఖ్యమనుకుంటే, ఇప్పుడు రూల్సు మారాయంటున్నారు కదా, మీ మనవలకి తల్లి కులం రాయించండి చూద్దాం,' అని దయామణి ఛాలెంజ్ చేస్తుండగా, నాకు అర్జంటు ఫోనొచ్చిందని కబురు వస్తే హెడ్మాస్టరు గారి ఆఫీసుకు వెళ్ళాను కంగారుగా.

మా కుర్రాడు సూపర్మేన్లా మెడకు టవలు చుట్టుకుని గోడమీంచి దూకి, ఆకాశంలోకి ఎగిరి పోవడానికి బదులు నేల మీద పడి కాళ్ళు విరగ్గొట్టుకున్నాడట -మా ఆవిడ ఖంగారుపడుతూ చెప్పింది. వాణ్ణి డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాను. కాలు బెణికింది కాని విరగలేదని, ఆయన ఆయింట్మెంటు రాసి, కాపడం పెట్టమన్నారు.

'ఇరవైనాలుగ్గంటలూ అలా టీ.వీ ముందు ఏడుస్తుంటే ఇలాంటి వెధవ అయిడియాలే వస్తుంటాయి. టి.వీ ముందు నుంచి లెమ్మంటే ప్రాణం పోతుంది మీకు....' అని విసుక్కున్నాను.

'బావుంది, టీ.వీ చూస్తున్న పిల్లలంతా గోడలమీంచి దూకి కాళ్లు విరగ్గొంటుకుంటు న్నారా? ఎవరి పోలికలొచ్చాయో? కోతి వెధవ..... కోతిబుద్ధులు....' అంటూ మొదలు పెట్టింది మా ఆవిడ. నేను చెవులు మూసుకోబోతుంటే, 'గుడ్మార్నింగ్ సార్' అని విని పించి ఉలిక్కి పడి చూశాను. ఎదురుగా నా ప్రియ

శిష్యుడు జగన్నాథం మధ్యాహ్నం పోస్టు తీసుకొస్తూ కనిపించాడు.

'ఎలా ఉన్నావురా నాయనా ?'

'బ్రహ్మాండంగా ఉన్నాను సార్ ! మీ దయవల్ల ....'

'నా దయ ఏమిటి? దేవుడి దయ అను. ఆయన దయ వల్లనే నీకీ ఉద్యోగం వచ్చింది.....'

'అమ్మ! అలా అనకండి సార్! మీరు డ్రిల్లు చేయించిన కాళ్ళు ..... ఎన్ని మైళ్లు నడిచినా, సైకిలు తొక్కినా అలుపు సొలుపూ లేదు. '

'ఉత్తరాలేమైనా ఉన్నాయా?'

జగన్నాథం ఉత్తరాల కట్ట తెరిచి చూస్తూ-'..... విశ్వనాథం మాస్టారు.... వెంకటేశ్వర్రావుగారూ.... దయామణి మేడం.... సుల్తాన్ గాడు.... మీకు లేవు సార్.... ఏవిటిలా డాక్టర్‌గారి దగ్గరకు వచ్చారు?' అన్నాడు.

విషయం వివరించి, 'నువ్వు స్కూలుకి వెళ్ళినపుడు నేను కొంచెం ఆలస్యంగా వస్తానని హెడ్మాస్టర్ గారికి చెప్పు' అన్నాను.

వాడు డాక్టరుగారికి ఉత్తరాలు అందించి, స్కూలువైపు వెళ్ళిపోయాడు. నేను ఫ్యామిలీని ఇంటి దగ్గర దిగబెట్టి స్కూలుకు తిరిగి వచ్చి హెడ్మాస్టర్ గారి ఆఫీసులో అడుగు పెట్టే సరికి అక్కడ వాతావరణం సీరియస్‌గా ఉన్నట్టు కనిపించింది. విశ్వనాథం, శర్మగారు, రాజుల లక్ష్మి గారు, ఏదోతప్పు చేసిన వాళ్ళలా నిలబడి ఉన్నారు. వాళ్ళతో హెడ్మాస్టరుగారు అంటున్నారు-'......... నేనెన్నో సార్లు చెప్పాను.... స్కూల్లో ఇటువంటి విషయాలు మాట్లాడొద్దని..... ఒకళ్ళ మనసులు ఒకళ్ళు కష్టపెట్టుకోవడం, మనసుల్లో ద్వేషం పెరగడం తప్ప ప్రయోజనం ఏమైనా ఉందా? నా మాటవింటే కదా'

'అసలు దయామణే మొదలు పెట్టింది..... కావలిస్తే వీళ్ళనడగండి...'- శర్మగారు సణుగుతున్నట్టు సంజాయిషీ ఇచ్చారు.

'..... ఆవిడ మొదలుపెట్టిందే అనుకోండి..... మీరందరూ దాన్ని తెగేదాకా లాగాలా? మాస్టారూ! మీరు వయసులో పెద్దవారు. మీకు చెప్పడం బాగోదు. అందరూ ఎవరి క్లాసులకు వాళ్ళు వెళ్ళండి. మీరు చదువు చెప్పకపోయినా పరవాలేదు కాని మీకేస్ట్ పాలి టిక్స్ పిల్లల బుర్రలకి ఎక్కించి వాళ్ళని పాడు చేయకండి. వెళ్ళండి' - హెడ్మాస్టరుగారు చికాగ్గా అన్నారు. అంతా ఆయన ఆఫీసునుంచి నిశ్శబ్దంగా బయటకి నడిచారు.

'ఏమైంది లక్ష్మిగారూ?' - రాజుల లక్ష్మిగారిని ఆపుచేసి మెల్లగా అడిగాను.

'నువ్వుండగానే మొదలైంది కదా చంద్రం! తర్వాత పదినిమిషాలకి నా క్లాసుకు టైమవుతే నేను వెళ్ళి పోయాను. నా క్లాసయి అరగంట క్రితం తిరిగి వచ్చేటప్పటికి, స్టాఫ్ రూంలో దయామణి ఏడుస్తూ కనిపించింది. ఏమైందంటే మాట్లాడదు. ఏం జరిగిందో నాకూ తెలియదు' అన్నారావిడ.

'నేను అడిగి చూస్తాను' అంటూ స్టాఫ్ రూం వైపు దారి తీశాను. స్టాఫ్ రూం దగ్గర వరండాలో తచ్చాడుతూ వెంకటేశ్వర్రావుగారు కనిపించారు.

'ఏమైంది మాస్టారూ?'

ఆయన కంగారు పడి నాకేసి చూశారు. ఆయన మొహం పాలిపోయి ఉంది.

'నేను.... వద్దంటూనే ఉన్నానండి.... దయామణి గారికి ఇష్టం లేదు..... నా మాటెవరింటారండీ?' అన్నారు ఆయన తడబడుతూ. ఆయనేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కాలేదు.

'దయామణి స్టాఫ్ రూంలో ఉందా?'

'ఆయ్....ఉన్నారండీ'

స్టాఫ్ రూంలో నేను అడుగుపెట్టగానే దయామణి కళ్ళెత్తిచూసింది. కాని ఏం మాట్లాడలేదు. ఆవిడ ఏడ్చినట్లు ఎర్రబడ్డ కళ్ళు, ఉబ్బిన మొహం చెబుతూనే ఉన్నాయి. నేను ఆవిడ ఎదురుగా కూర్చుని తటపటాయిస్తూ అన్నాను.

'మీరు .... అలా .... ఉంటే...... మాకేం బాగాలేదు.....'

దయామణి ఏం మాట్లాడలేదు.

'...... శర్మగారికి చాదస్తం.... కాలం మారినా కొంతమంది మనుషులు మారరు..... అంతే'

పిచ్చి బ్రాహ్మడు - ఆయన్ను అనుకోడం దేనికి పాపం?'

'మరి?'- నేను తెల్లబోయాను.

దయామణి హేండ్‌బ్యాగ్‌లోంచి ఇన్లాండ్ లెటర్ తీసి ఇచ్చి జేబు రుమాలుతో కళ్ళు తుడుచుకోవడం మొదలు పెట్టింది. నేను కంగారు పడుతూ కవరు తెరిచాను. అందులో ఒకే ఒక వాక్యం ఉంది - 'అమ్మా! నేనూ, రవి, ఈరోజు ఉదయం పెళ్ళి చేసుకున్నాం - విజయ.' ఉత్తరం తేదీ పన్నెండు. అంటే విజయ పెళ్లయి మూడురోజులైంది.

'రవి ఎవరు?'

'వెంకటేశ్వర్రావుగారి అబ్బాయి'

'మన వెంకటేశ్వర్రావు గారేనా?'

'మ....న.... వెంకటేశ్వర్రావు.....గా...రే...'-వెటకారంగా అంది దయామణి.

'మన వెంకటేశ్వర్రావుగారబ్బాయా? వాడికేం? చాకులాంటి కుర్రాడు. కొంచెం నల్లగా ఉన్నా కళైన ముఖం. నెమ్మదస్తుడు.... బుద్ధిమంతుడు.... ' - దయామణి మొహం లో రంగులు మారడం చూసి నేను కొంచెం తగ్గాను - '..... మీకు చెప్పకుండా, మీరు లేకుండా పెళ్ళి చేసుకున్నందుకు మీకు బాధగానే ఉంటుంది. విజయ అలా చేసి ఉండకూడదు. అయినా వాడు మనకు తెలియని వాడు కాదు కదా! వాళ్లిద్దరూ ఇష్ట పడ్డారు. పోనీండి. పైగా మీరూ .... మీరూ ఒకటే కదా'

అలా అనగానే నేను ఏదో కాని మాట అన్నట్టు దయామణి మొహం కందగడ్డలా ఎర్రబడింది- 'వాళ్ళూ, మేమూ ఒకటెలా అవుతాం? వాళ్ళు యండీస్'

'యండీస్ అంటే?'

'మాదిగలు - వాళ్ళూ, మేమూ ఒకటెలా అవుతాం? ' అంది దయామణి రోషంగా.

**(ఆంధ్రప్రభ వారపత్రిక. 14.5.1997)**